తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక



హైదరాబాద్ గురువారం 26 - 11 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 2

మోత్కూరు మార్కెట్ చైర్మన్ పదవి ఈసారి..

అడ్డగూడూరుకు ఇస్తాం

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది



ప్రజావారధి/మోత్కూరు

త్వరలో భర్తీ చేయనున్న మోత్కూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని ఈసారి అడ్డగూడూరు మండలానికి ఇస్తామని, వైస్ చైర్మన్ ఆత్మకూరు(ఎం) మండలానికి ఇస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. మోత్కూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన వారిని వదులుకోమని, వారందరినీ గుర్తిస్తామని, నామినేటెడ్ పదవులతో పాటు దశలవారీగా భర్తీ చేసే పదవులను అర్హులైన నాయకులకే ఇస్తామని చెప్పారు. మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌తో పాటు పాలకవర్గాన్ని త్వరలోనే నామినేటెడ్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. నియోజకవర్గంలో కొత్తగా ఐదు సింగిల్‌విండోల ఏర్పాటు కోసం తాను సీఎం రేవంత్‌రెడ్డిని విన్నవించగా మూడు సంఘాలు మంజూరయ్యాయని, మిగతా వాటిని కూడా మంత్రులతో మాట్లాడి మంజూరయ్యేలా చూస్తానన్నారు. అదే సమయంలో పార్టీ గీత దాటి పని చేస్తున్న వారు ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో కొత్త మండలాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని పట్టించుకోలేదని, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి స్వంత మండలం నాగారంతో పాటు అడ్డగూడూరు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు స్వంత భవనాలు మంజూరు చేయించి నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ కొనసాగిస్తూనే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి విడతలో నియోజకవర్గంలోని 9 గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి అర్హులైన పేదలంతా ఇండ్లు కట్టుకున్నారని, వాటితో పాటు 3500 ఇండ్లు మంజూరు చేశామని, రెండో విడతలో 2500 ఇండ్లు వచ్చాయని, అందులో 500 ఇండ్లు రూఫ్‌లెస్ కింద అర్హులైన పేదలకు కేటాయిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో రైతుబంధుతో పాటు రైతు బీమా భూములున్న వారికే అమలు చేశారని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ బీమా పథకం ద్వారా రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అమలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా 5 వేలకు పైగా పింఛన్లు మంజూరు చేయించామన్నారు. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరెలు అందించారని తెలిపారు. హ్యాం రోడ్ల నిర్మాణం కోసం నియోజకవర్గానికి రూ.18 కోట్లు మంజూరయ్యాయని, మోత్కూరులో బిక్కేరు వాగుపై

ఆత్మకూరు(ఎం)కు వైస్ చైర్మన్ పదవి

బ్రిడ్జి కోసం, ముశిపట్ల-దత్తప్పగూడెం బీటీ రోడ్డు కోసం మంత్రి వెంకట్‌రెడ్డికి విన్నవించామన్నారు. మోత్కూరులో కోర్టు మంజూరు కోసం హైకోర్టు జడ్జిని కలిసి విన్నవించానని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మోత్కూరు మున్సిపాలిటీకి మంజూరైన రూ.15 కోట్ల నిధులతో చేపట్టే పనులకు టెండర్ పూర్తయ్యిందని, గతంలో ప్రతిపాదించిన విధంగా ఆ పనులు కూడా త్వరలోనే ప్రారంభవుతాయని తెలిపారు. అడ్డగూడూరుకు మంజూరైన ఏటీసీ సెంటర్ ద్వారా 200 మంది విద్యార్థులు శిక్షణ పొందుతారని, దాని ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అడ్డగూడూరు మండలంలోని డి.రేపాక గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం సేకరించిన భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ.1.80 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు రాచకొండ బాలరాజు, లింగాల నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బద్దం నాగార్జునరెడ్డి, మహిళా మండల, పట్టణ అధ్యక్షురాళ్లు ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ, మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న, కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య, జిల్లా నాయకులు డాక్టర్ జి.లక్ష్మీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిలుపు వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక

గురువారం
26 - 11 - 2026

తిరిగి ప్రారంభం కానున్న గురజాల షటిల్ బస్సు

ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలకు సర్పంచ్ రోజాసుధాకర్ వినతి

ప్రజావారధి/శాలిగౌరారం

ఇటీవల రద్దయిన గురజాల షటిల్ బస్సును ఆర్టీసీ అధికారులు తిరిగి ప్రారంభించేందుకు హామీ ఇచ్చారని గ్రామ సర్పంచ్ ఎర్ర రోజాసుధాకర్ తెలిపారు. నకిరేకల్ నుంచి వయా శాలిగౌరారం మీదుగా గురజాల వరకు నడిచే ఆర్టీసీ షటిల్ బస్సును అధికారులు ఇటీవల అర్ధాంతరంగా రద్దు చేయడంతో



బుధవారం బస్సును పునరుద్ధరించాలని కోరుతూ నల్లగొండ ఆర్టీసీ ఇన్‌చార్జి ఆర్ఎం నామ నర్సింహ, డీఎం మేరీ లావణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సు రద్దు చేయడంతో విద్యార్థులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను నల్లగొండ ఆర్టీసీ ఇన్‌చార్జి ఆర్ఎం, డీఎంలకు వివరించామన్నారు. దీంతో వారు వెంటనే స్పందించి ఈనెల 28 నుంచి తిరిగి బస్సును ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్టు చెప్పారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలు ఎక్కకుండా సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులను మాత్రమే ఎక్కాలని కోరారు. బస్సును తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన ఆర్ఎం, డీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు.